సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 11 । మే । 2023



సెలవుల సందడి

వేములవాడ: రాజన్న సన్నిధిలో సెలవుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



రాజన్నను దర్శించుకున్న ఏడీజీపీ

వేములవాడ: రాజన్నను అడిషనల్ డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శశిధర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది.

• గీత కార్మికుడి ఇంటా సరస్వతీ పుత్రిక



వైష్ణవికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ముస్తాబాద్(సిరిసిల్ల): గీత కార్మికుడి ఇంటా సరస్వతి పుత్రిక ఉదయించింది. పదో తరగతి ఫలితాల్లో 10జీపీఏ సాధించింది. ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామానికి చెందిన గున్నాల వెంకటస్వామిగౌడ్ గీత కార్మికుడు. భార్య రేఖ బీడీ కార్మికురాలు. వీళ్లకూతురు వైష్ణవి నామాపూర్ మోడల్‌స్కూల్‌లో చదివి పదోతరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనేది తన ఆశయం అని వైష్ణవి తెలిపింది. వైష్ణవిని ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ రజిత, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్ అభినందించారు.

• అడ్డురాని పేదరికం



వైష్ణవిని సన్మానిస్తున్న మూడపల్లి సర్పంచ్ అంజిబాబు

చందుర్తి: రెక్కాడితేగానీ డొక్కనిండని కుటుంబం వారిది. తండ్రి తిరుపతి జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. తల్లి సుజాత వ్యవసాయ పనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటోంది. కూతురు వైష్ణవి మూడపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదివింది. పదోతరగతి ఫలితాల్లో 10జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. చిన్ననాటి నుంచి పేదరికంలో మగ్గుతున్న కుటుంబం మాది. ఆ పేదరికమే నాలో పట్టుదలను పెంచిందని వైష్ణవి తెలిపింది.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

• కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

గంభీరావుపేట(సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ధాన్యం విక్రయానికి వచ్చిన రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్ణీత తేమశాతం వచ్చిన వెంటనే కొనుగోళ్లు నిర్వహించాలని, ఓపీఎంఎస్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంను వెంటనే లోడింగ్ రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట జిల్లా సహకారశాఖ అధికారి బుద్ద నాయుడు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేంద్రప్రసాద్ ఉన్నారు. అనంతరం గంభీరావుపేట మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

గోదాములు పరిశీలించిన కలెక్టర్

సిరిసిల్లఅర్బన్: జూన్ 1 నిర్వహించనున్న ఈవీఎం ఫస్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ కోసం సర్దాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని గోదాంలను కలెక్టర్ అనురాగ్‌జయంతి పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, ఎమ్మార్వో విజయ్‌కుమార్, రెహమాన్ ఉన్నారు.

పవర్ సబ్సిడీని అమలు చేయాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అందించిన రాయితీని కాలరాస్తూ.. బీఆర్ఎస్ సర్కారు సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమపై సవతిప్రేమ చూపిస్తోందని సీఐటీయూ(తెలంగాణ పవర్ లూం వర్కర్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ అన్నారు. బుధవారం సిరిసిల్ల బీవై నగర్‌లోని పార్టీ ఆఫీసులో మాట్లాడారు.సిరిసిల్లలోని పవర్‌లూమ్స్‌కు ఇండస్ట్రియల్ కింద కరెంటు చార్జీలు విధించడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. గతప్రభుత్వాలు సిరిసిల్లలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో యాభైశాతం సబ్సిడీని అందించాయని, దాన్ని ఇప్పటి సర్కారు రద్దు చేస్తూ.. కొత్త నిబంధనలతో యూనిట్‌కు రూ.8.25చార్జీలు విధించడం ఏంటని ప్రశ్నించారు. నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, ఎలిగేటి రాజశేఖర్, రమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

- పదోతరగతి ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రంలో ఆరోస్థానం
- అమ్మాయిలదే హవా..
- రెసిడెన్షియల్‌లో అత్యధిక ఉత్తీర్ణత
- ప్రభుత్వ విద్యాలయాల్లో తగ్గిన ఉత్తీర్ణతశాతం

94.37

శాతం ఉత్తీర్ణత



విద్యాసంవత్సరాల వారీగా ఉత్తీర్ణత శాతం

సిరిసిల్లఎడ్యుకేషన్: పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ఆరోస్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా 6,486 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరవగా 6,121మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 94.37 ఉత్తీర్ణత శాతం నమోదైంది. జిల్లాలో 3,362 మంది బాలికలు పరీక్షలు రాయగా.. 3,202 మంది పాసై 95.24 ఉత్తీర్ణతశాతం సాధించారు. 3,124మంది బాలురకు 2,919మంది పాసై 93.44 ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. ఈ ఫలితాల్లోనూ అమ్మాయిలు పైచేయిగా నిలిచారు. పదోతరగతి ఫలితాల్లో గతంలో జిల్లా రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఒక మెట్టు ఎక్కి ఆరోస్థానంలో నిలిచింది. జిల్లాలో ప్రత్యేక తరగతులు నిర్వహణ చేపట్టడంతో, పది ఫలితాల కోసం అభ్యసన స్టడీమెటీరియల్స్ అందించడంతో ఫలితాల్లో కాస్త మెరుగుపడినట్లు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

అత్యధికం రెసిడెన్షియల్..
అత్యల్పం ప్రభుత్వ స్కూల్స్

- జిల్లాలో బీసీ వెల్ఫేర్, ప్రభుత్వ, కేజీబీవీ, ఆదర్శ, ప్రైవేటు, రెసిడెన్సియల్, మైనార్టీ రెసిడెన్సియల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, జిల్లా పరిషత్ వంటి యాజమాన్యాల ఆధీనంలో ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాశారు.
- బీసీ వెల్ఫేర్‌లో 250మంది పరీక్షలు రాయగా 248మంది పాసయ్యారు. 92.9 ఉత్తీర్ణతశాతం నమోదు చేశారు.
- ప్రభుత్వ పాఠశాల నుంచి 56మంది విద్యార్థులకుగాను 46 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించగా.. 82.14 శాతం అత్యల్ప ఉత్తీర్ణత జాబితాలో నిలిచారు.
- కేజీబీవీలో 385మంది విద్యార్థులకుగాను 355 మంది పాసై 92.21 ఉత్తీర్ణతశాతం సాధించారు. ఆదర్శ విద్యాలయాల నుంచి 658 విద్యార్థుల్లో 640 మంది పాసై 97.26 ఉత్తీర్ణతశాతం నమోదు చేశారు.
- ప్రైవేటు విద్యాలయాల నుంచి 1,400 మందిలో 1,370 మంది విద్యార్థులు పాస్‌కాగా.. 97.86 ఉత్తీర్ణతశాతం సాధించారు. రెసిడెన్సియల్ విద్యాలయం నుంచి 76 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. అందరూ పాసయ్యారు.
- మైనార్టీ రెసిడెన్సియల్ నుంచి 94మంది విద్యార్థులు పరీక్షహాజరుకాగా.. 91మంది పాసయ్యారు. 96.81 ఉత్తీర్ణతశాతం నమోదైంది. సోషల్ వెల్ఫేర్ విద్యాలయాల నుంచి 492 మంది విద్యార్థులకు 486మంది పాస్‌కాగా.. 98.78 ఉత్తీర్ణతశాతం నమోదైంది.
- ట్రైబల్ వెల్ఫేర్ నుంచి 247 మందికి 232మంది పాసయ్యారు. 93.93 ఉత్తీర్ణత శాతం నమోదైంది.
- జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి 2,836 మంది విద్యార్థులు హాజరవగా.. 2,577 మంది పాసై 90.87శాతం నమోదు చేసుకుని జిల్లాను రాష్ట్రంలో ఆరోస్థానంలో నిలిపినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

10 జీపీఏ సాధించిన విద్యాలయాలు ఇవే..

పదోతరగతి ఫలితాల్లో 'ప్రభుత్వ' విద్యార్థులు మెరిశారు. సిరిసిల్ల మహాత్మ జ్యోతిబాపూలే బాలుర విద్యాలయంలో 5, ఇల్లంతకుంట మోడల్ స్కూల్‌లో 3, సిరిసిల్ల కేజీబీవీలో 2, ఎల్లారెడ్డిపేట జెడ్పీ స్కూల్‌లో ఇద్దరు 10జీపీఏ సాధించారు. వేములవాడ బాలికల జ్యోతిబాపూలే, లింగన్నపేట జ్యోతిబాపూలే, ముస్తాబాద్ మోడల్ స్కూల్, నేరెళ్ల రెసిడెన్షియల్, ముస్తాబాద్ సోషల్ వెల్ఫేర్ స్కూల్, సిరిసిల్ల బాలికలు, అంబేద్కర్ జెడ్పీ స్కూల్, కొత్తపల్లి జెడ్పీహైస్కూల్, మూడపల్లి, పెద్దపల్లి, రాచర్ల బొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఒకరు చొప్పున 10జీపీఏ సాధించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి



సిరిసిల్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ అన్నారు. పదో తరగతిలో ప్రతిభ చాటిన తంగళ్లపల్లి మైనార్టీ గురుకుల బాలికలను బుధవారం కలెక్టరేట్‌లో అభినందించారు. తంగళ్లపల్లి మైనార్టీ గురుకులంలో 49 మంది బాలికలు పరీక్షలు రాయగా.. 48 మంది ఉత్తీర్ణులు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎస్‌డీ.సర్వర్ మియా, ప్రిన్సిపాల్ ఫాతిమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15 నుంచి సీఎం కప్

సిరిసిల్లఅర్బన్: ఈనెల 15 నుంచి 31 వరకు సీఎంకప్- 2023 పేరిట మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో 18 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి ఉపేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 17 వరకు మండలస్థాయిలో అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో గెలుపొందిన విజేతలకు 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 31వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వయస్సు 15 నుంచి 36ఏళ్లలోపు ఉండాలని తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ను కలిసిన గడ్డం నర్సయ్య



మంత్రి కేటీఆర్‌కు పూలమొక్క అందిస్తున్న గడ్డం నర్సయ్య

సిరిసిల్ల: ప్రపంచ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని మంత్రి కేటీఆర్ చాటి చెబుతున్నారని జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య అన్నారు. మంత్రి కేటీఆర్ లండన్ వెళ్తున్న సందర్భంగా ప్రగతి భవన్‌లో బుధవారం కలిశారు. రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు, పెట్టుబడులను రాబట్టేందుకు మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారని గడ్డం నర్సయ్య అన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): వాహనదారులు రోడ్డు భద్రతా నియామాలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని సీఐ మొగిలి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపిన ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..వాహనదారులు వాహన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సై శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాలలు



పోతుగల్ జెడ్పీ స్కూల్‌లో మద్యం బాటిళ్లు

ముస్తాబాద్ : ప్రభుత్వ పాఠశాలలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మందుబాబులు మద్యంతాగి బాటిళ్లను అక్కడే పడేశారు. పోతుగల్‌తోపాటు ముస్తాబాద్ జెడ్పీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అడ్డావేసి రాత్రి మద్యం తాగుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.


కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

ముస్తాబాద్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు అన్నారు. మండలంలోని రామలక్ష్మణపల్లె, మద్దికుంట గ్రామాల్లో బుధవారం 50 మందికి పైగా బీఆర్ఎస్, పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారికి ఉమేశ్‌రావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం మరిచిందన్నారు. మున్ముందు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతారన్నారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తిరుపతి, రాజమల్లయ్య, గిరిధర్ రెడ్డి, సత్తయ్యగౌడ్, కొండయ్య, రాగుల రాజు, నవీన్ తదితరులున్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : గురుకుల విద్యాలయాల్లో ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. 2023–24 విద్యాసంవత్సరానికి 6, 7,8 తరగతుల్లో సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు జిల్లా కో ఆర్డినేటర్ కె.శ్రీనాథ్ తెలిపారు.

కర్రీ డోంట్ వర్రీ..

- కర్రీ పాయింట్లు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్న నిర్వాహకులు
- బ్యాచ్‌లర్స్‌కు ఎంతో ఉపయోగకరం
- హోటల్ ఫుడ్‌కు దూరం..



ఈ చిత్రంలో కనిపిస్తున్న దంపతులు గంగాధర మండలం వెంకటాయపల్లికి చెందినవారు. రెండేళ్ల క్రితం వేములవాడకు వచ్చి కర్రీ పాయింట్ పెట్టారు. గతంలో హరీశ్ హైదరాబాద్‌లో మార్కెటింగ్ ఉద్యోగం చేసేవాడు. ఉద్యోగం వదిలేసి వేములవాడలో కర్రీ పాయింట్ పెట్టారు. దంపతులిద్దరూ వండి ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. నెలకు రూ.20 వేలవరకు సంపాదిస్తున్నామని చెబుతున్నారు.



వేములవాడలో కర్రీ పాయింట్



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు అత్తాకోడళ్లు. రోజూ వంటలు చేస్తూ పలువురికి రుచి కరమైన కర్రీస్‌ను అందిస్తున్నారు. జమ్మికుంటకు చెందిన వీరు ఏడాది క్రితం వేములవాడకు వచ్చారు. సత్యనారాయణ– సరోజన, వెంకటేశ్– ఉమాదేవి దంపతులు స్వయంగా కష్టపడుతూ ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ మరో ఇల్లు అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. గతంలో వెంకటేశ్ మంచిర్యాలలో రెస్టారెంట్‌లో పనిచేయగా తల్లిదండ్రులు హోటల్ నడిపేవారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు తిరుపతి. వేములవాడ రూరల్ మండలం నమిలిగుండపల్లి నుంచి గల్ఫ్‌కు వెళ్లాడు. గల్ఫ్‌లోనే చెఫ్‌గా పని నేర్చుకున్నాడు. పదేళ్ల క్రితం వేములవాడలో కర్రీ పాయింట్ పెట్టాడు. తాను ఉపాధి పొందుతూ మరొకరికి రూ. 11 వేలు వేతనం చెల్లిస్తూ ఉపాధి కల్పిస్తున్నారు.

వేములవాడ: జీవనశైలి మారింది. యాంత్రికమైన జీవనంలో ఒత్తిడితో సతమతమవుతున్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో ఏదో ప్రాంతానికి ఉపాధి కోసం వలస వెళ్లిన పలువురు వేములవాడలోనే కర్రీ పాయింట్లు నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. రోజంతా రుచికర వంటలు తయారు చేస్తూ కస్టమర్లకు అందిస్తున్నారు. దీంతో బ్యాచ్‌లర్స్‌కు ఇదెంతో ఉపయోగకరంగా మారుతోంది. వేసవి సెలవులు కావడంతో భార్యాపిల్లలు సెలవులు గడిపేందుకు వెళితే హోటల్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ కర్రీ పాయింట్స్ వద్ద కర్రీస్ తీసుకొని ఇంట్లోనే తింటున్న వారిసంఖ్య గణనీయంగా పెరిగింది. వేములవాడలో పది వరకు కర్రీ పాయింట్లు నిత్యం ప్రజలకు కర్రీస్‌ను అందిస్తున్నాయి.

కర్రీస్	ధరలు (పావుకిలో)
చికెన్	రూ. 100.
మటన్	రూ. 190.
తలకాయ	రూ. 150.
బోటి	రూ. 130.
ఎగ్‌కరీ	రూ. 40.
పప్పు	రూ. 30.
ఇతర కూరగాయలు	రూ. 30.
మక్క గుడాలు	రూ. 30.
బబ్బెర గుడాలు	రూ. 35.
వండి ఇచ్చే కర్రీస్	**ధరలు (కిలో)**
చికెన్	రూ. 130.
మటన్	రూ. 150.
ఫిష్	రూ. 150.
తలకాయ	రూ. 170.

పెద్ద హోటళ్ల కంటే రుచికర వంటకాలు..



పెద్ద హోటళ్లకంటే కర్రీ పాయింట్స్‌లో రుచికరమైన వంటకాలు లభిస్తున్నాయి. సమయం వృథా కాకుండా కర్రీ తీసుకెళ్లి ఇంట్లో రైస్ పెట్టుకొని తింటున్నాం. చపాతి తీసుకెళ్లి ఇంట్లో తింటే ఎంతో ఆనందంగా ఉంటుంది. హోటళ్లలో తినే ఫుడ్‌కంటే కర్రీస్ తెచ్చుకొని తింటే ఆరోగ్యంగా ఉండొచ్చు.

– చేని లింగం, వేములవాడ, కస్టమర్

'నేతన్న' డాక్యుమెంటరీ విడుదల



డాక్యుమెంటరీ విడుదల చేస్తున్న చైర్మన్ ప్రవీణ్

కరీంనగర్ కల్చరల్: ఒకప్పుడు నేత కార్మికుల ఆత్మహత్యలకు నిలయమైన సిరిసిల్ల ఇప్పుడు ఆ సామాజికవర్గానికి నిజమైన సిరిసంపదల ఖిల్లాగా మారింది. దీన్ని వివరించే జై మార్కండేయ బ్యానర్‌పై రూపొందించిన ×నేతన్న డాక్యుమెంటరీని బుధవారం హైదరాబాద్ నారాయణగూడలోని టెస్కో భవన్‌లో తెలంగాణ పవర్‌లూం, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల నేతన్నల జీవితాల్లో వెలుగులు ప్రసరించిన తీరుపై పద్మశాలీ మహిళ గోనె స్వర్ణ అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ డాక్యుమెంటరీ తీశారని తెలిపారు. ఇది వాస్తవాలకు అద్దం పట్టిందన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంటరీ సమర్పకుడు గోనె రాజేంద్రప్రసాద్, దర్శకుడు అయిలు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీసులు

బోయినపల్లి (చొప్పదండి) : మండలంలోని కొదురుపాక గ్రామ పరిసరాల్లో బుధవారం గంజాయి విక్రేతను పట్టుకున్నట్లు వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్సై మామిడి మహేందర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొదురుపాక ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో విక్రయిస్తున్నాడన్న సమాచారంతో డిప్యూటీ తహసీల్దార్ ఆర్. దివ్యజ్యోతి కలిసి పట్టుకున్నామన్నారు. ఆ వ్యక్తి పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందినవాడని, అతడి నుంచి 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

'అనిల్ కుటుంబాన్ని ఆదుకోవాలి'

బోయినపల్లి (చొప్పదండి) : జమ్మూకాశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన జవాన్ పబ్బాల అనిల్ కటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్మీ జవాన్ ప్రమాదంలో మృతిచెందితే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనిల్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం, ఇంటిస్థలం కేటాయించాలని కోరారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండల కేంద్రంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాముల నాగరాజు (25) మూడు రోజులక్రితం ఇంట్లో ఉరేసుకోగా బుధవారం చుట్టుపక్కల వారికి దుర్వాసన రావడంతో నాగరాజు ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడికి తల్లి సత్తవ్వ, తండ్రి మల్లేశం ఉన్నారు. సత్తవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఇల్లంతకుంట (మానకొండూర్): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండల కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడాపోటీల ముగింపుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యువకులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్నవారికి పోలీస్‌శాఖ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సైలు రాజేశ్, లక్ష్మారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, సర్పంచులు భాగ్యలక్ష్మి, జితేందర్ గౌడ్, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, తదితరులున్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం



ఫుడ్‌కోర్టును ప్రారంభిస్తున్న అరుణ

వేములవాడ: రాష్ట్రంలోని అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. వేములవాడ పట్టణంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ కోసం ఇన్ఫోసెమ్ కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టును బుధవారం ప్రారంభించారు. తెలంగాణలో ప్రతి ఒక్కరూ గౌరవంగా బతికేందుకు అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాలు అందిస్తూ మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జిల్లా వెల్ఫేర్ అధికారి లక్ష్మీరాజం, కౌన్సిలర్ రేగుల సంతోశ్‌బాబు, సీడీపీవో ఎల్లయ్య, డిస్ట్రిక్ట్ ఉమెన్ ఎంపవర్మెంట్ కో–ఆర్డినేటర్ రోజా, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన డీసీవో



రికార్డులు పరిశీలిస్తున్న డీసీవో బుద్ధనాయుడు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీవో బుద్ధనాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కొనుగోలుపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని సూచించారు. రైతుల అకౌంట్‌లో నగదు వెనువెంటనే జమఅయ్యే విధంగా చూడాలని సూచించారు. ప్యాక్స్ డైరెక్టర్ సలేంద్రి బాలరాజ్, సీఈవో గౌరీ శంకర్, తదితరులు ఉన్నారు.

బీమా పథకాలు వర్తింపజేయాలి

కోనరావుపేట: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తు న్న ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల్లో ప్రతీ ఒక్కరు చేరేలా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు అన్నారు. కోనరావుపేట మండలపరిషత్ కార్యాలయంలో జీఎంఎల్‌బీసీ బ్యాంకర్ల సమావేశం జరిగింది. జీవనజ్యోతి బీమా పథకంలో ప్రతిఒక్కరు చేరేలా చూడాలని, 18–50 ఏళ్లలోపు వారికి ఏడాదికి రూ.436 ప్రీమియం ఉంటుందన్నారు. సు రక్ష బీమా పథకంలో 18–70 ఏళ్లలోపు చేరవచ్చ ని, వార్షిక ప్రీమియం రూ.20 ఉంటుందని, రూ. 2 లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, ఎంపీడీవోలు రామకృష్ణ, శంకర్, నరేశ్, ఏపీఎంలు దేవరాజు, రాజు, నర్సయ్య, కోనరావుపేట. రుద్రంగి, వీర్నపెల్లి మండలాల బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో 'మానేరు' విజయఢంకా



టాపర్స్‌తో విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు విజయఢంకా మోగించినట్లు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. 9 మంది సనా ఫర్హత్, సహస్ర, శిరీష, చరిష్మా, స్ఫూర్తి, స్నిగ్ధ, హన్సిక, అద్నాన్, దర్శిల్‌లు 10 జీపీఏ, 14 మంది 9.8 జీపీఏ, ఏడుగురు 9.7 జీపీఏ, ఆరుగురు 9.5 జీపీఏ, 54 మంది 9.0 ఆపై జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానేరు విద్యాసంస్థల విద్యార్థులందరూ ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డితోపాటు డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కృష్ణారెడ్డి, శ్వేతారెడ్డి, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

'పారమిత' విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: పదోతరగతి ఫలితాల్లో పారమిత పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 11 మంది 10 జీపీఏ, 20 మంది 9.8 జీపీఏ, 38 శాతం మంది 9.5 ఆపైన జీపీఏ, 65 శాతం విద్యార్థులు 9.0 ఆపైన జీపీఏ, 91 శాతం మంది 8.0 ఆపైన జీపీఏ సాధించారు. విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత ఇ.ప్రసాదరావు అభినందించారు. తమ విద్యాసంస్థల్లో నైపుణ్యాలకు పెద్దపీట వేసి, ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా పిల్లలను అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, రష్మిత ప్రసాద్, రాకేశ్, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, ఎస్‌వోడీ తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'తేజస్' సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల యాజమాన్యం సీహెచ్.సతీశ్‌రావు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.యశ్వంత్ 465, యు.హర్షిత్ 464, టి.గణేశ్ 463, ఎం.రమేశ్‌కుమార్ 461 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సీహెచ్.సూర్య 984, ఎస్.శ్రావణిరెడ్డి 981, సీ ఈసీలో ఎ.అక్షయ్ 973 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



మాట్లాడుతున్న వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము

సిరిసిల్ల అర్బన్: అకాలవర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల మున్సిపల పరిధి రగుడులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నారు. తేమ, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. ఇక్కడ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొలపురి ఆనంద్, పట్టణాధ్యక్షుడు మ్యాన లక్ష్మణ్, దేవరాజు, సత్యనారాయణ, మహిపాల్ తదితరులున్నారు.

నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్: నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమరవీరుల కుటుంబాలకు రూ.25వేల పెన్షన్, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తుందన్నారు. ప్రియాంకాగాంధీ సభ సక్సెస్‌తో అధికార బీఆర్ఎస్, బీజేపీ నేతల్లో వణుకు మొదలైందన్నారు. త్వరలోనే బీజేపీ, బీఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని హెచ్చరించారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కామునివనిత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల డిమాండ్లను పరిష్కరించాలి

వేములవాడరూరల్ : ఐకేపీ వీవోఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలో ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మెకు బుధవారం మద్దతు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇక్కడ మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, రూరల్ పార్టీ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి, జిల్లా సీనియర్ నాయకులు చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, లింగంపల్లి కిరణ్, తదితరులున్నారు.

10 జీపీఏ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రమేశ్

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : జిల్లాలోని పలు విద్యాలయాల్లో పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించారు. సిరిసిల్ల అంబేడ్కర్ జెడ్పీ హైస్కూల్ విద్యాలయంలోని వర్ష 10 జీపీఏ, గీతానగర్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బి. శ్రీలక్ష్మి 10 జీపీఏ సాధించగా ఉపాధ్యాయులు అభినందించారు. సిరిసిల్ల కేజీబీవీల్లో 365 మంది విద్యార్థులు పరీక్ష రాయగా సలేంద్రి అక్షయ, న్యాలకొండ శ్రీయ 10 జీపీఏ సాధించారు. జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఎ.భానుతేజ, జె.ప్రణవి, ఎల్.హర్షిత, ఎన్.శ్రీజ, వి.మనోజ్, పి. సాయిశ్రీ 10 జీపీఏ సాధించగా జిల్లా విద్యాధికారి రమేశ్ అభినందించారు.